రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు

RNI.No.TGTEL/25/A1964

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక

రిపోర్టర్లు కావలెను

పామూమ్యడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 47 ఎడిటర్ :పెనుగొండ సతీష్ శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 పేజీలు 8 వెల 5.00





## ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు




- ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు
- ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం
- కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ

న్యూఢిల్లీ, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి వేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా... ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు.

2లో

### అసెంబ్లీ ఎన్నికలు కాదు...

## జూబ్లీహిల్స్ గురించి మాట్లాడు

- పార్లమెంటులో ఎన్ని సీట్లు వచ్చాయో లోకల్ బాడీలోనూ అంతే
- కెటిఆర్ విమర్శలపై భగ్గుమన్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికో మూడున్నర సంవత్సరాల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా.. త్వరలో వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా అంటూ కేటీఆర్‌కి పొంగలేటి సవాల్ విసిరారు. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా? లేదా ఫారిన్‌లో ఉంటావా? అంటూ విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక ఎన్నికల్లో కూడా అంతే సీట్లు వస్తాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఖమ్మం రూరల్ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి మళ్లీ ఎలా గెలుస్తారో చూద్దాం అని అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు.

సీఎం రేవంత్ రెడ్డి ఎంత కష్టపడుతున్నారో అందరికీ తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకు కనిపించనిది, వినిపించనిది.. ప్రతిపక్షంలో కనిపిస్తుంది అంటే విడ్డూరం, హాస్యాస్పదంగా ఉంది. విభజన సమయంలో రాష్ట్రాన్ని ఇచ్చిన ప్రధాన పార్టీ కాంగ్రెస్. నాడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల పాలు చేసింది. మా ప్రభుత్వం పేదోళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే కొంతమంది విషం కక్కుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని పొంగులేటి అన్నారు.

2లో

## సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

- రాహుల్ విమర్శలను ఖండించిన ఇసి
- అబద్ధాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం
- రాహుల్ విమర్శలపై మండిపడ్డ బిజెపి నేతలు




న్యూఢిల్లీ, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారని ఈసీ వెల్లడించింది. ఇలా తొలగింపు అన్నది జరగదని కూడా ఇసి స్పష్టం చేసింది.

## హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

- దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18: నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ... లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధిచేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్ ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షిం చారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు

2లో



## సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

- తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ

హైదరాబాద్, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నటు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు.

## యూరియా వైఫల్యం కేంద్రానిది

- ప్రభుత్వంపై బురదజల్లుతున్న బిఆర్ఎస్
- మండిపడ్డట్ట మంత్రి సీతక్క



ఖమ్మం, సెప్టెంబర్ 18 : ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేసి బదనాం చేస్తోందని ఆరోపించారు. యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నిందలు

2లో

### అభాగ్యుల కన్నీళ్లు

## తుడవలేని ప్రభుత్వం

- ఇటీవలి ప్రమాదాలపై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18: రాష్ట్రంలో అధి కారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అభాగ్యుల కన్నీళ్ల తుడవలేని అమానవీయ సర్కార్ ఇది అని కేటీఆర్ విమర్శించారు. అది ఎస్ఎల్‌బీసీ సొరంగం అయినా, సిగాచీ పరిశ్రమ అయినా, హైదరాబాద్ వరదలయినా, ప్రతి చోటా అదే నేరపూరిత నిర్లక్ష్యం, అదే చేతగానితనం అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు.

2లో

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



- 21 వేయి స్తంభాల గుడిలో తొలి బతుకమ్మ
- గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా సంబరాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

హైదరాబాద్, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు

2లో

## పిల్లలకు విలువలను వారసత్వంగా ఇవ్వండి

- మహనీయుల చరిత్రలను తెలియచేయండి
- సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణలో ఎంపి ఈటెల రాజేందర్



హైదరాబాద్,(ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : పిల్లలకు వారసత్వంగా ఆస్తులు కాకుండా విలువలు, సంప్రదా యాలు, దేశభక్తిని నేర్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. కన్నవారిని, కన్నపిల్లలను, జీవిత భాగస్వామిని చంపుకుంటున్న ఘటనలు కలచివేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన విలువలే మనల్ని ఇలాంటి దురాగతాల నుంచి కాపాడతాయని హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గం కాప్రాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా

2లో

## కొడుకు పెళ్లి రిసిప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

- రైతుల సంక్షేమం కోసం 2 కోట్లు ఇవ్వాలని నిర్ణయం
- సిఎం రేవంత్‌ను కలిసి చెక్ అందచేసిన బత్తుల లక్ష్మారెడ్డి



హైదరాబాద్, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదారత చాటుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రెండు కోట్లు విరాళంగా

2లో

## ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు

- కలెక్టర్‌తో మాట్లాడిన కెటిఆర్



వికారాబాద్, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు మారుస్తోందని ప్రశ్నల

11లో

## నేనంటే గిట్టని వారి దుష్ప్రచారం

- పార్టీ మారడం,రాజీనామా చేయడం అంటూ రూమర్స్
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరణ



నల్లగొండ, (ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18 : తనటే గిట్టని కొందరు వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి

2లో




# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

మొదటిపేజీ తరువాయి

ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్‌ల నుంచి ఓట్లు తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు- వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100 శాతం రుజువును కనుగొన్నాము. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ప్రజాస్వామ్య పక్రియను ప్రేమిస్తున్నాను. నేను ఆ పక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు.ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాదృచ్ఛికంగా పట్టుబడినట్లు తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌ల్లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతాంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.

# సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

మొదటిపేజీ తరువాయి

ఇదిలావుంటే ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడు తున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారని దిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

# రాగల మూడు రోజులు భారీ వర్షాలు...

మొదటిపేజీ తరువాయి

శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరిం చింది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ-మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషీరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీ మీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# పిల్లలకు విలువలను వారసత్వంగా ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ ఆత్మగౌరవం, దేశభక్తి విలువలు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ ఆత్మగౌరవం కోసం ఎమ్మెల్యే పదవిని గడ్డిపోచలా వదిలివేశామని ఈటల రాజేందర్ అన్నారు. ఆత్మగౌరవం కోల్పోయి వచ్చే ఏ పదవి అయినా విలువలేనిదని ఆయన స్పష్టం చేశారు. స్వయంపాలన కోసమే తాము 20 ఏళ్లలో ఆరుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచామని గుర్తు చేసుకున్నారు. ఈ ఘటనలు ఎక్కడో జరుగుతున్నాయని అనుకోవద్దని, అవి మన ఇంటి గడపను కూడా తట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. మహనీయుల విగ్రహాలను స్థాపించడం, జయంతులు, వర్ధంతులు చేసుకోవడం కేవలం దండ వేయడానికి మాత్రమే కాదని, వారి చరిత్రను భావితరాలకు అందించడం కోసమని ఈటల అన్నారు. తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తుచేస్తూ, భారత స్వాతంత్ర్యం కోసం లక్షల మంది చేసిన పోరాటాలను, త్యాగాలను ఆయన కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి మాట్లాడుతూ, ఆయన గొప్ప మేధావి అని, తన ప్రాణం భారత జాతి విముక్తి కోసమేనని పోరాడారని ప్రశంసించారు. భారతదేశంలో సాధ్యం కాకపోవడంతో వేరే దేశానికి వెళ్లి 'ఆజాద్ హింద్ ఫౌజ్' స్థాపించి దేశం కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు.



# సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీ-ష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ- హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంతకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు. యూకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరించారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ బాధల నుంచి పుట్టిందని చరిత్రలో ఉందని వివరించారు. కొత్తగా కవులను, రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలు పాడేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో ఘనంగా ఏర్పాట్లు- చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా మన సంస్కృతి తెలిసేలా ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. బతుకమ్మ పండుగ చేసుకున్న తర్వాత చెరువులో వదలాలని...అందుకు తగిన ఏర్పాట్లు- చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పండుగపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. బతుకమ్మ పండుగ ముఖ్య ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయంగా చేసుకోవాలని. ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు. మొదటిరోజు చేసుకునే ఎంగిలి పువ్వు బతుకమ్మ దగ్గరి నుంచి చివరి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెళ్లాలని సూచించారు. బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు

మొదటిపేజీ తరువాయి

వర్షం కురిపించారు. అలైన్‌మెంట్‌ను మార్చి రోడ్డు నిర్మాణం చేపడితే మరో లగచర్ల ఘటన రిపీట్ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కేటీఆర్ హెచ్చరించారు.గతంలో ఆమోదించిన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్‌ని మార్చి సర్వే నెంబర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది.అయితే, గతంలో నిర్మించ తలపెట్టిన మార్గంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉండటంతో అలైన్‌మెంట్‌ను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలైన్‌మెంట్ మార్పుతో రైతులు భారీగా భూములు కోల్పోతున్నారు. ఈ విషయంపై వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేశారు అన్నదాతలు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని కేటీఆర్‌ను కలిశారు. మోమిన్‌పేట మండల గ్రామాల రైతులు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడారు కేటీఆర్. పేద రైతుల భూములను గుంజుకొని వారికి అన్యాయం చేస్తే మరో లగచర్ల ఘటన చోటు చేసుకుంటుందని కలెక్టర్‌ను హెచ్చరించారు. అయితే, కలెక్టర్‌ను హెచ్చరించిన వీడియో వికారాబాద్ జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.

# కొడుకు పెళ్లి రిసిప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

మొదటిపేజీ తరువాయి

ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో సిఎం రేవంత్ రెడ్డికి అందించారు. తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ. 2 కోట్ల చెక్ అంద జేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో వెంటనే సిఎంకు చెక్కును అందించారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు.

# అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

వరదనీటి నాలాల్లో ముగ్గురు గల్లంతై నాలుగు రోజులు దాటినా కాంగ్రెస్ సర్కార్ చేష్టలు డిగి చూస్తుందని మండిపడ్డారు. ప్రాణాలు ఎలాగూ కాపాడలేరు.. దురదృష్టవశాత్తూ ఎవరైనా మరణిస్తే కనీసం పార్థివదేహాలు అయినా వెలికితీయలేని అసమర్థ ప్రభుత్వం ఇది! అభాగ్యుల కన్నీళ్ళు తుడవలేని అమానవీయ సర్కారు ఇది! అని కేటీఆర్ విమర్శించారు.

# నేనంటే గిట్టని వారి దుష్ప్రచారం

మొదటిపేజీ తరువాయి

రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు లో ఓ కార్యక్రమానికి వెళ్తూ... చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారంపై స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి? ఇవాళ కూడా ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు. నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# అసెంబ్లీ ఎన్నికలు కాదు... జూబ్లీహిల్స్ గురించి మాట్లాడు

మొదటిపేజీ తరువాయి

కమిషన్‌లు వచ్చే కాళేశ్వరం కట్టాలను కున్నారు కానీ.. పేదోడికి డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు నేడు ఈ పరిస్థితి ఉండేది కాదు. పాముకు కోరల్లో మాత్రమే విషం ఉంటే.. మీకు ఒళ్ళంతా విషం ఉంటుంది. రెండు పర్యాయాలు మీకు బుద్ధి చెప్పారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు బుద్ధి చెప్పాలని పొంగులేటి ఫైర్ అయ్యారు. మీ కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. మీ సోదరిమణి సమస్య, మీ బిడ్డ సమస్య ను మా సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే యత్నం చేస్తున్నారు. మొన్న ట్విట్టర్ టిల్లు ఏదో మాట్లాడుతున్నాడు. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎన్నికల గురించి కాదు మాట్లాడేది.. ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలుసుకో. మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు, దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, గురించి నేను మాట్లాడను. కేటీఆర్.. ముందుగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి చూడు. బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా, ఫారిన్ వెళ్తావా చూడాలి. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బిఫామ్ తీసుకోలేదు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసినా ఏమి చేయలేకపోయాడు, నువ్వెంత బచ్చాగాడివి. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదు, ఇచ్చిన మాట కోసం నిలబడి నెరవేర్చే పార్టీ. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరు. తల కిందులూ పెట్టిన పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు- వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే సీట్లు వస్తాయని పొంగులేటి అన్నారు.




# హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ఇటీవల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్ నగర్‌లో ఒకరు నాలాలో కొట్టుకుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసి కట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని సూచించారు. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించు కోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. దిశ సమావేశంలో ఎంపి ఈటెల రాజేందర్ సహా పలువురు నేతలు, కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# యూరియా వైఫల్యం కేంద్రానిది

మొదటిపేజీ తరువాయి

వేస్తోందని ఆమె అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని విమర్శించిన మంత్రి సీతక్క, తాము భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను, మహిళలకు వివిధ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరిన ఆమె, స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.



# ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ భవన నిర్మాణ స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మేడ్చల్ మల్కాజిగిరి, సెప్టెంబర్ 18 : తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అఫ్లిలేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజ్ గర్ల్స్ భవన నిర్మాణం పనులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ మండలంలోని సోమవారం గ్రామంలో నిర్మిస్తున్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అఫ్లిలేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ భవన నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవన నిర్మాణ పనులు ఎంతవరకు పూర్తయ్యాయని, ఇంకా ఎన్ని రోజులలో పూర్తవుతుందని ఏ ఏ పనులు పెండింగ్లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని సూచించారు. డార్మెంటరీ తరగతి గదులు కిచెన్ టాయిలెట్స్ వంటి వాటిని ముందుగా పూర్తి చేసుకుని వినియోగించుకోవాలని ఆదేశించారు. బోడుప్పల్‌లో ప్రైవేటు బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను దసరా సెలవుల లోపు తరలించాలని ఆర్సిఓను ఆదేశించారు. నిర్మాణ పనులను చేపట్టాలని అత్యవసరమైన వాటిని ముందుగా పూర్తి చేసుకుని భవనాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మొత్తము ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదనంగా అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్ ఆర్ సి ఓ నాగార్జున ప్రిన్సిపల్ మమత తదితరులు పాల్గొన్నారు.



## ఓదెలలో ఘనంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ఓదెల(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేట్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, ఉద్యమకారుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ఏకం చేస్తూ, వారి సంక్షేమార్థం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం పట్టుదలతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఓదెల మల్లన్న ఆశీస్సులతో డాక్టర్ శ్రీనివాస్ నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జంగం కొమురయ్య, గాజుల శివశంకర్, కందుల అశోక్ పటేల్, గుండేటి అశోక్, మామిడిసెట్టి శంకరయ్య, మాటూరి ఎల్లయ్య, అసరి కొమురయ్య, గాజుల శ్రీచరణ్, గంధం రవి, ఈదా కిషోర్, పల్లపు మల్లేష్, కర్రే ప్రభాకర్ రెడ్డి, వేల్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌జిఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడలలో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి(ఆకాంక్ష) : పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో కె. శ్రీనాథ్ 1500 మీటర్ల పందెంలో బంగారు పతకం, బి. అక్షిత 400 మీటర్ల పందెంలో బంగారు పతకం, ఎస్. లోహిక 800 మీటర్ల పందెంలో కాంస్య పతకం, ఎస్. వరసిద్ధు డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థుల విజయాలతో ఉపాధ్యాయ వర్గం, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ సురేందర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధిస్తారని అభినందించారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ "చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నందువల్లే మా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలకు చేరుకునే లక్ష్యాలను నిర్దేశించుకొని విజయాలను సాధిస్తున్నారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజనీదేవి, ప్రిన్సిపాల్ విజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎ. అజయ్ కుమార్, బి. మంజుల పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## వృద్ధులకు భోజనం అందజేయడం అభినందనీయమం

గుడివాడ,(ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18: స్థానిక మందపాడు లోని నిరాశ్రయుల ఆశ్రమంలో శొంఠి పెద్దవెంకటేశ్వరావు 5వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆశ్రమంలో వృద్ధులకు భోజనం చేసిన శొంఠి కుటుంబ సభ్యులను బిజెపి పట్టణాధ్యక్షుడు డాక్టర్ మాచర్ల రామకృష్ణ(ఆర్కే) అభినందించారు. ఈ సందర్భంగా అర్కే మాట్లాడుతూ అన్నదానం పరబ్రహ్మ స్వరూపం అనే నినాదంతో శ్రీ హరిపురం గ్రామానికి చెందిన శొంఠి పెదవెంకటేశ్వరావు వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పేదవారికి ఆహారం అందజేయడం జరిగిందన్నారు. చాలామంది ఇలాంటి కార్యక్రమాలు బంధుమిత్రులతో ఎంతో ఖర్చు వెచ్చించి కార్యక్రమాలు చేస్తూ ఉంటారు కానీ వారి తండ్రి వర్ధంతి సందర్భంగా పేదవారికి, ఆకలితో ఉన్న అన్నార్థులకు ఆహారం అందజేయడం చాలా మంచి కార్యక్రమన్నారు. పట్టణ ప్రజలు మీ పెళ్లి రోజులు, పుట్టినరోజులు, వివిధ శుభ కార్యక్రమాలకు మీ పేరు మీద ఆకలితో ఉన్న అనార్థులకు ఆహారం అందజేయాలని కోరారు.

## విఠల్ నగర్ రైల్వే ట్రాక్ ప్రక్కన చెత్త వల్నరబుల్ పాయింట్ శుభ్రపరచడం



గోదావరిఖని(ఆకాంక్ష) : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుభ్రతా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం విట్టల్‌నగర్ రైల్వే ట్రాక్ ప్రక్కన ఉన్న చెత్త వల్నరబుల్ పాయింట్‌ను ప్రత్యేకంగా గుర్తించి శుభ్రపరిచారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు అధికారి బుద్దార్తి శైలజ, పర్యావరణ ఇంజనీర్ మధుకర్, మెప్మా సీఓ ఊర్మిళ, వార్డు అసిస్టెంట్లు మురళి, రమేష్, సానిటరీ జవాన్ సుగుణాకర్, ఆర్‌పీలు, స్వశక్తి మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలందరూ శుభ్రత పట్ల చైతన్యంగా వ్యవహరించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన బిన్‌లను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రైల్వే ట్రాక్ పక్కన చెత్త పేరుకుపోవడం వల్ల కలిగే సమస్యలను పరిష్కరించేందుకు ఇలాంటి చర్యలు తరచుగా చేపడతామని అధికారులు స్పష్టం చేశారు. స్థానికులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీ రుద్రేశ్వరీ దేవి శరనవరాత్రి మహోత్సవాల కరపత్ర ఆవిష్కరణ

**- పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ**

**- ఈ నేల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రుద్రేశ్వరి దేవి శర నవరాత్రి ఉత్సవాలు**

**- భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శరన్నవరాత్రి ఉత్సవాలను పాల్గొనాలని పిలుపు**



హన్మకొండ ,సెప్టెంబర్ 18(ఆకాంక్ష న్యూస్):-చారిత్రక ఓరుగల్లు నగరంలోని వేయి స్తంభాల దేవాలయంలో ఈ నేల 22వ తేదీన రుద్రేశ్వరీ దేవి శర నవరాత్రి మహోత్సవాల సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను గురువారం హనుమకొండలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో స్థానిక వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ రావు, ఆలయ ఈవో డి.అనిల్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ కలిసి ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 21వ తేదీన బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుందని, 22వ తేదీ నుండి వెయ్యి స్తంభాల రుద్రేశ్వర ఆలయంలో రుద్రేశ్వరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు, సంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, ప్రతినిత్యం ఈ తొమ్మిది రోజులపాటు ప్రజల క్షేమం కొరకు వారు ఆయురారోగ్యాలతో ఉండాలని లోకకళ్యాణార్థం ప్రతిరోజు చండీ హోమ కార్యక్రమం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి రుద్రేశ్వరి దేవి ఉత్సవ విగ్రహం ప్రతిష్టించి ప్రతి రోజు అమ్మవారికి అలంకారాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఉత్సవాలు రాజకీయాల కతీతంగా ఇస్తున్నామని భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరావాలని తెలిపారు. మున్సిపల్, కుడా, పోలీస్, టూరిజం, సంస్కృతిక, వైద్యశాఖలతో పాటు సంబంధిత శాఖలు సమన్యాయంతో ఉత్సవాలను సమకూర్చుకుని దానికి అనుగుణంగా జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశాలు ఇచ్చారని, నిష్ణాతులైన కళాకారులతో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు గాని ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ.. ఈ నవరాత్రి ఉత్సవాలలో దేవి చతుష్ట ఉపాధ్యాయ పూజలు త్రికాలములో ఉంటాయని అన్నారు. రుద్రేశ్వరి దేవి ఉత్సవాలు ఈనెల 22 నుండి మొదలుకొని అక్టోబర్ 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ తొమ్మిది రోజులపాటు రుద్రేశ్వరి దేవిని రోజుకు ఒక అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చే విధంగా బాలత్రిపుర సుందరి దేవి,అన్నపూర్ణ దేవి,గాయత్రి దేవి,మహాలక్ష్మీ దేవి,లలిత మహా త్రిపురసుందరి దేవి,భవాని దేవి,కాత్యాయని దేవి,సరస్వతి దేవి,దుర్గాదేవి, మహిషాసురమర్ధిని,రాజా రాజేశ్వరి దేవిగా ఇలా తొమ్మిది రోజులపాటు రోజుకొక అవతారంతో రుద్రేశ్వరి దేవిని అలంకారణ చేసి భక్తుల కు దర్శనం ఇస్తుందని తెలిపారు. ఈ ఉత్సవాలు సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ప్రతినిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు వేయి స్తంభాల దేవాలయంలోని రుద్రేశ్వరీ దేవి శర నవరాత్రి మహోత్సవాలలో పాల్గొని రుద్రేశ్వరీ దేవిని దర్శించుకుని సకల భోగభాగ్యాలు అందుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డి.అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దేవాదాయ ధర్మాదాయ శాఖ పక్షాన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి సౌకర్యం భక్తులు ఆడే బతుకమ్మ పండుగకు పారిశుద్ధ్య ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కరపత్ర ఆవిష్కరణలో ఉత్సవ సేవ సమితి కార్యదర్శి కోన శ్రీకర్, తౌటి రెడ్డి రవీందర్ రెడ్డి, సేవా సమితి సభ్యులు పులి రజనీకాంత్, రావుల ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్లకు 'పోషన్ బి పడాయి బి' శిక్షణా కార్యక్రమం

మంథని(ఆకాంక్ష) : మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ సూచనల మేరకు మంథని ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులపాటు 'పోషన్ బి పడాయి బి' శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో టీచర్లకు వీడియోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, డిజిటల్ తరగతుల ద్వారా పోషణ, బోధనా విధానాలపై అవగాహన కల్పించారు. అదనంగా, టీచర్లు స్వయంగా టీ ఎల్ ఎం (టిచింగ్ లెర్నింగ్ మెటీరియల్) తయారు చేసి ప్రదర్శించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మంథని సిడిపిఓ పుష్పలత, సూపర్వైజర్లు రజిత, సరిత, స్వప్న, శారద, అనితశ్రీజ, అలాగే డీసీ పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ పాల్గొని అంగన్వాడీ టీచర్లను ప్రోత్సహించారు.





## మంథని జిల్లా సంచలనం...

**- వామన్‌రావు దంపతుల హత్య కేసులో సీబీఐ విచారణ ప్రారంభం**

మంథని(ఆకాంక్ష) : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన హైకోర్టు న్యాయవాది గట్టు వామన్‌రావు - నాగమణి దంపతుల హత్య కేసు మరో మలుపు తిరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించిన నేపథ్యంలో గురువారం సీబీఐ అధికారులు మంథని మండలం గుంజపడుగు గ్రామంలో విచారణను ప్రారంభించారు. ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందంగా మంథని చేరుకున్న సీబీఐ అధికారులు, మొదటగా వామన్‌రావు కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. వామన్‌రావు తండ్రి కిషన్‌రావు, తమ్ముడు చంద్రశేఖర్‌ను కలుసుకొని, హత్యకు దారితీసిన పరిణామాలపై విపులంగా వివరాలు సేకరించారు. వామన్‌రావు దంపతుల హత్యలో మాజీ ఎమ్మెల్యే ప్రమేయం ఉందని కిషన్‌రావు మునుపే చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న సీబీఐ అధికారులు, ఆ అంశంపై లోతుగా విచారణ చేపట్టినట్లు సమాచారం. తదుపరి సీబీఐ బృందం మంథని కోర్టు ప్రాంగణానికి చేరుకొని, హత్య కేసులో నడుస్తున్న న్యాయపరమైన అంశాలపై రికార్డులను పరిశీలించింది. అనంతరం వామన్‌రావు దంపతులు హత్యకు గురైన ప్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సాక్ష్యాధారాల సేకరణకు ప్రయత్నించారు. వారి వెంట గోదావరిఖని ఏసీపీ రమేష్ కూడా పాల్గొని, స్థానికంగా లభ్యమైన సమాచారం మొత్తం సీబీఐ అధికారులకు అందజేశారు. ఇప్పటికే ఈ కేసులో ఏడుగురు నిందితులు జైలులో ఉండగా, కొంతకాలం క్రితమే వారిలో పలువురు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో విచారణ వేగం పెంచిన సీబీఐ బృందం, నిందితుల ప్రమేయం, రాజకీయ సంబంధాలపై మరింత లోతైన అన్వేషణ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. విచారణ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, వామన్‌రావు కుటుంబ సభ్యులు విచారణ పట్ల నమ్మకం వ్యక్తం చేశారు. "మా కుమారుడు వృత్తి రీత్యా అనేక సమస్యలను వెలుగులోకి తెచ్చాడు. నిజమైన నిందితులు శిక్షించబడతారని ఆశిస్తున్నాము" అని కిషన్‌రావు మీడియాతో అన్నారు. దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించిన ఈ జంట హత్య కేసులో సీబీఐ అధికారుల నేరుగా రంగప్రవేశం చేయడంతో, రాబోయే రోజుల్లో కీలకమైన మలుపులు తిరగవచ్చన్న ఊహాగానాలు మంథని పట్టణంలో జోరుగా వినిపిస్తున్నాయి.

# ఎట్టకేలకు ఐదు రోజుల తరువాత ఒక మృతదేహం లభ్యం



హైదరాబాద్, సెప్టెంబర్ 18(ఆకాంక్షన్యూస్): హైదరాబాద్ లో భారీ వర్షాలకు ఐదు రోజుల క్రితం వరదలో గల్లంతైనవారిలో ఒకరి మృతదేహం లభ్యం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం బీమా లింగం కత్వా వద్ద మూసీ ప్రవాహానికి కొట్టుకొచ్చిన మృతదేహం దాదావు 70 కిలోమీటర్లు కొట్టుకుపోయిన డెడ్ బాడీ హబీబ్ నగర్ డ్రెయిన్‌లో వరద నీటిలో కొట్టుకుపోయిన అర్జున్ మృతదేహంగా గుర్తింపు కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన డిఆర్ఎఫ్ సిబ్బంది.

## పాడే మోసిన తక్కళ్ళపల్లి రాజు



భూపాలపల్లి జిల్లామొగుళ్లపల్లి (ఆకాంక్ష న్యూస్)సెప్టెంబర్ 18 : మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన ఊరుగొండ రాజేందర్ అనారోగ్యంతో గురు వారం ఉదయం మృతిచెందగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు (రాజేశ్వర్ రావు) మృతుని పార్థివ దేహాన్ని సందర్శించి అంత్యక్రియల్లో పాల్గొని ఊరుగొండ రాజేందర్ ఆత్మకు శాంతిః చేకూరాలని పాడే మోసి కన్నీటితో వీడ్కోలు పలికారు. మృతిని కుటుంబానికి ఆ భగవంతుడు అన్ని విధాలుగా ఆదుకోవాలని వేడుకున్న తక్కళ్ళపల్లి రాజు ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# సేవాపక్షం కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు





వరంగల్ జిల్లా,సెప్టెంబర్ 18(ఆకాంక్ష న్యూస్):. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారికి జన్మదిన సందర్భం గా దేశవ్యాప్తంగా 15 రోజులు పాటు జరుగుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా నేడు వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని 35వ డివిజన్ శివనగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మండల ప్రధాన కార్యదర్శి వైట్ల గణేష్ గారి ఆధ్వర్యంలో స్వచ్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రావు గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా 15 రోజుల పాటు జరుగుతున్నటు వంటి సేవా కార్యక్రమాలు భాగంగా నేడు ఈ యొక్క స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులను కోరారు. వీరితోపాటు ఈ యొక్క కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, సేవ పక్షం జిల్లా కన్వీనర్ కనుకుంట్ల రంజిత్, కో కన్వీనర్ కర్నే రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మండల అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, సేవ పక్షం మండల కన్వీనర్ సాగరిక, బండి సుజాత, జిల్లా నాయకులు సిద్ధం నరేష్, అంకాల జనార్ధన్, బిజెపి నాయకులు సూర శ్రీనివాస్, పిట్టల వెంకన్న, నవీన్, కోమాకుల నాగరాజు, రాజు, కోట సతీష్, చందరాజు, సురేష్, శ్రీకాంత్, ఆదిత్య చిన్న,మధు మరియు తదితర నాయకులు కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరం పై మొగుళ్లపల్లి పోలీసుల ఆకస్మిక దాడి

భూపాలపల్లి మొగుళ్ళపల్లి ,(ఆకాంక్ష న్యూస్) సెప్టెంబర్ 18:మండలంలో పేకాట స్థావర%శీ%పై ఆకస్మికంగా దాడి చేసి పేకాట రాయులను అరెస్టు చేసినట్లు మొగుళ్ళ పల్లి ఎస్ ఐ. బొరగల అశోక్ తెలిపారు. ఎస్సై అందించిన సమాచారం మేరకు. మొగుళ్ళ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్లపల్లి గ్రామ శివారులో నిర్మానుష్యమైన ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై దాడి చేసి, పేకాట ఆడుతున్న పదకొండు మందిని (జూదరులను) అదుపులోకి తీసుకొని పేకాటరాయుల వద్ద నుండి ఇరువై తొమ్మిది వేల నాలుగు వందల పది రూపాయల నగదు, 8 ద్విచక్ర వాహనాలను. పేక ముక్కలు స్వాధీనం చేసుకోని పట్టుబడిన వారిని తదుపరి విచారణ నిమిత్తం మొగుళ్ళ పల్లి పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని

పోలీస్ స్టేషన్ కు తరలించిన వారిలో

ఎ -1. ఎడ్ల మల్లారెడ్డి గ్రామం భుజునూర్ జిల్లా కరీంనగర్.

ఎ -2. సరిగొమ్ముల ఓదెలు

గ్రామం : భుజునూర్ జిల్లా కరీంనగర్,

ఎ -3. పెద్దోజు రమేష్

గ్రామం: సీతంపేట, జిల్లా కరీంనగర్.

ఎ -4. చిలక శ్రీనివాస్

గ్రామం: సీతంపేట జిల్లా కరీంనగర్.

ఎ -5. చిలుక శ్రీను గ్రామం: సీతంపేట, జిల్లా కరీంనగర్.

ఎ -6. మక్కపెల్లి శేఖర్

గ్రామం : సీతంపేట జిల్లా కరీంనగర్.

ఎ -7. పాక తిరుపతి, గ్రామం :సీతంపేట జిల్లా కరీంనగర్,

ఎ -8. గుండ్ల లక్ష్మయ్య

గ్రామం : సీతంపేట జిల్లా కరీంనగర్.

ఎ -9. పిట్టల రమేష్

గ్రామం : సీతంపేట , జిల్లా కరీంనగర్.

ఎ -10. పిట్టల రాజేష్ గ్రామం : సీతంపేట జిల్లా కరీంనగర్.

ఎ -11. పిట్టల రమేష్ గ్రామం : సీతంపేట జిల్లా కరీంనగర్.

పేకాట రాయులు 11 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి అశోక్ తెలిపారు.

# తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ



హైదరాబాద్ ,(ఆకాంక్ష న్యూస్): తెలంగాణ ఆర్టీసీలో డ్రైవర్ శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీస్ నియామక మండలి బుధవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసింది, మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,743 కాగా. ఇందులో డ్రైవర్ కొలువులు ఒక 1,000స్రామిక్ పోస్టులు 743 ఉన్నాయి, అక్టోబర్ 8వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి వెబ్సైట్ ద్వారా దరఖాస్తులను ఆన్లైన్లో స్వీకరించనున్నారు. గతంలో ఈ పోస్టులను ఆర్టీసీ సంస్థ నే ఈ ఉద్యోగాల్ని భర్తీ చేసేది,కాని ఇప్పుడు ఈ డ్రైవర్, శ్రామిక్, పోస్టుల భర్తీని పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ కు అప్పగించారు. డ్రైవర్ పోస్టులకు 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకు శ్రామిక్ ఉద్యోగాలకు 18 నుంచి 30 సంవత్సరాల వరకు వయోపరిమితి ఉంది, ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.

**నోటిఫికేషన్ వివరాల్లోకి వెళ్తే..**

డ్రైవర్ ఉద్యోగాలకు జీతం రూ. 29,960 నుంచి స్టార్ట్ అవుతుందని పేర్కొన్నారు. ఇక శ్రామిక్ పోస్టులకు నెలకు జీతం రూ. 16,550 నుంచి రూ. 45,030 వరకు ఉంటుందని తెలిపారు.

**డ్రైవర్ పోస్టుల్లో జిల్లాల వారీగా పోస్టులు ఇలా ఉన్నాయి.**

ఆదిలాబాద్ జిల్లాలో 21, మంచిర్యాల 24, నిర్మల్ 21, ఆసిఫాబాద్ జిల్లాలో 15 పోస్టులు ఉన్నాయి. ఇక కరీంనగర్ జిల్లాలో 12, పెద్దపల్లి జిల్లాలో 10, జగిత్యాల 11, సిరిసిల్ల 7, భూపాలపల్లి 5, ములుగులో 3 పోస్టులు ఉన్నాయి. మెదక్ 10, సిద్దిపేట 13, నిజామాబాద్ 49, కామారెడ్డి 30, ఖమ్మం 44, భద్రాద్రి కొత్తగూడెం 34, మహబూబ్ నగర్ 20, తోపాటు...నాగర్ కర్నూల్ జిల్లాలో 20, గద్వాల 13, వనపర్తి 13, నారాయణపేట 13, నల్గొండ 31, సూర్యాపేట 22, యాదాద్రి భువనగిరి 15, వరంగల్ 29, హన్మకొండ 41, మహబూబాబాద్ 31, జనగాం 21, రంగారెడ్డి 88, మేడ్చల్ 93, వికారాబాద్ 34 ఇక అత్యధికంగా హైదరాబాద్ లో 148 పోస్టులు ఉండగా.. సంగారెడ్డి జిల్లాలో 59 పోస్టులు ఉన్నాయి. శ్రామిక్ పోస్టుల వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లాలో 4, మంచిర్యాల 4, నిర్మల్ 4, ఆసిఫాబాద్ జిల్లాలో 3 పోస్టులు ఉన్నాయి. ఇక కరీంనగర్ జిల్లాలో 7, పెద్దపల్లి జిల్లాలో 06, జగిత్యాల 07, సిరిసిల్ల 04, భూపాలపల్లి 03, ములుగులో 02 పోస్టులు ఉన్నాయి. మెదక్ 1, సిద్దిపేట 1, నిజామాబాద్ 14, కామారెడ్డి 09, ఖమ్మం 18, భద్రాద్రి కొత్తగూడెం 14, మహబూబ్ నగర్ 04, నాగర్ కర్నూల్ జిల్లాలో 04, జోగులాంబ గద్వాల 03, వనపర్తి 02, నారాయణపేట 02, నల్గొండ 20, సూర్యాపేట 14, యాదాద్రి భువనగిరి10,వరంగల్ 15, హన్మకొండ 21, మహబూబాబాద్ 15, జనగాం 10, రంగారెడ్డి 77, మేడ్చల్ 81, వికారాబాద్ 29 ఇక అత్యధికంగా హైదరాబాద్ లో 129 పోస్టులు ఉండగా.. సంగారెడ్డి జిల్లాలో 52 పోస్టులు ఉన్నాయి.



# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

జనగాం జిల్లా /పాలకుర్తి,(ఆకాంక్ష న్యూస్) : ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు నుండి గాంధీ పుట్టిన రోజు వరకు భాజపా ఆధ్వర్యంలో నిర్వహించే సేవపక్షంలో భాగంగా పాలకుర్తి భాజపా మండల శాఖ ఆధ్వర్యంలో పాటిమీద ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, మండల అధ్యక్షులు మారం రవికుమార్ గార్లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ గారు ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో వలన ప్రతి మారుమూల పల్లెటూరు సైతం ఆహ్లాదకరంగా తయారైందని గతంలో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదని ఇప్పుడు అలా కాకుండా ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించడమే కాకుండా గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా గ్రామపంచాయతీలకు నిధులు కేటాయిస్తూ ప్రతి గ్రామాన్ని పరిశుభ్రమైనటువంటి గ్రామంగా ఉండేవిధంగా స్వచ్ఛ భారతదేశము తయారు చేయడానికి నరేంద్ర మోడీ గారు కృషి చేస్తున్నారని దానిలో భాగంగా పాలకుర్తి మండలంలోని ప్రతి గ్రామాన్ని కూడా స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేయడానికి అధికారులు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్, పట్టణ అధ్యక్షుడు పబ్బా సంతోష్,మచ్చ సునీల్,తండ వినయ్,శ్రీనివాస్,కుమార స్వామి తదితరుల పాల్గొన్నారు

# యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

### -డ్రగ్ ఇన్స్పెక్టర్ జయలక్ష్మి

గుడివాడ, సెప్టెంబర్ 18(ఆకాంక్ష న్యూస్): రాజేంద్రనగర్ టౌన్ హై స్కూల్ లోని 8,9,10 తరగతుల పిల్లలకు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు మరియు వాటి దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించటం జరిగింది. ఈగల్‌చీఫ్ ఆకె రవి కృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణము నందు నార్కోటిక్ డ్రగ్స్ మరియు యాంటీబయాటిక్స్ గురించి అవగాహన కలిగించుటకు ఇందులో భాగంగా గుడివాడ డ్రగ్స్ ఇన్స్పెక్టర్ జయలక్ష్మి , ఈగల్ టీం తరపున మూర్తి, గుడివాడ ఒకటో పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ గౌతమ్ , ఆకర్ష ఫౌండేషన్ జ్యోతి, నెహ్రూ యువ కేంద్ర శ్వేత పాల్గొని ప్రసంగించారు. గుడివాడ డ్రగ్స్ ఇన్స్పెక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, నిజాయితీ, క్రమశిక్షణతో మరియు అంకితభావంతో ఉండాలని చెప్పారు. దురలవాట్లు మనకే కాకుండా, సమాజానికి హాని కలిగిస్తాయని వివరిస్తూ ఆడియో విజువల్ ప్రదర్శించారు.






# వాస్తవ లాభాలు ప్రకటించడంలో జాప్యమెందుకు?

**- మూసివేత బూచి చూపి కారుణ్య నియామకాలు రద్దు చేస్తారా!**

**- నేడు సింగరేణి సి,ఎండిని కలుస్తాం**

**- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి**



గోదావరిఖని టౌన్,,**(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : 2024-'25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన లాభాలు ఎంత? ఆడిట్ కాలేదా! లాభాల వాటా చెల్లించడంలో జాప్యం చేయమని ప్రభుత్వం చెబుతోందా? ఈ విషయమై కార్మిక వర్గం ఆందోళన చెందుతోంది అంటూ టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి సింగరేణి యాజమాన్యంపై ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1998-'99 నుండి ప్రారంభమైన లాభాల వాటా ఇప్పుడు సంస్థలో ప్రకటించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్మిక వర్గం ఆందోళన చెందుతోందని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా ఇదే పరిస్థితి ఎదురయ్యిందని, అప్పుడు తమ యూనియన్ చాలాసార్లు రిప్రజెంట్ చేయడం జరిగిందని, తమ ఎమ్మెల్యేలు దీక్ష చేస్తే గానీ చెల్లించలేదన్నారు. గత సంవత్సరం కూడా తమ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని జీయం కార్యాలయాల ముందు ధర్నా చేస్తేగానీ లాభాల వాటా ప్రకటించారని గుర్తు చేసారు. గత సంవత్సరం రూ. 4,701 కోట్ల నికర లాభాలు వచ్చాయని చెప్పి, దాంట్లో సంస్థ అభివృద్ధి కోసం అంటూ రూ. 2,289 కోట్లు పక్కనపెట్టి, మిగిలిన రూ. 2,412 కోట్లపై మాత్రమే 33 శాతం లాభాల వాటా పంచితే తమకొచ్చింది కేవలం 16.9 శాతం మాత్రమేనన్నారు. ఆ విధంగా ఒక్కో కార్మికుడు సగటున లక్షా 50 వేల రూపాయలు నష్టపోయాడని అన్నారు. ఇప్పుడు పండగ దగ్గరకు వచ్చిన తరుణంలో.. హడావుడిగా లాభాల వాటా ప్రకటించి, అనుకూలంగా లేకపోతే అంగీకరించని కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళన చేసే అవకాశం లేకుండా చేద్దామని యాజమాన్యం ఆలోచిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. గెలిచిన ఏఐటియుసి గాని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ఐఎన్టీయూసీగాని రిప్రెంటేషన్లకే పరిమితమై ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. లాభాల వాటా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పండగ అడ్వాన్స్ సర్క్యులర్ కూడా ఇప్పటికీ రాలేదన్నారు. చేతగాని యూనియన్ల నాయకత్వం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇంకో పదేళ్లలో బొగ్గు గనులు మూతపడతాయని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సి,ఎండి బలరాం నాయక్ చెప్పడం చూస్తుంటే గనులమూత అనే బూచి చూపి మెడికల్ బోర్డు రద్దు చేసి, కార్మికులకు కారుణ్య నియామకాలను దూరం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన ఈ పథకాన్ని రద్దు చేసి, ఆయన ఆనవాళ్లు లేకుండా చేద్దామని ఉద్దేశంతో కార్మికులను నష్టపరిచే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం తమ యూనియన్ గౌరవాధ్యక్షులు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తో కలిసి హైదరాబాద్ సింగరేణి భవన్ లో సీ,ఎండీని కలిసి మాస్ రిప్రజెంటేషన్ ఇస్తామన్నారు. యాజమాన్యంగానీ, ప్రభుత్వం గానీ లాభాల వాటా తక్షణమే ప్రకటించనట్లయితే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. టీబీజీకేఎస్ ఎల్లవేళలా కార్మికుల పక్షాన ఉంటుందన్నారు. ఇంకా ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు కె.సురేందర్ రెడ్డి, నూనె కొమురయ్య, మాదాసు రామ్మూర్తి, పర్లపల్లి రవి, జాహిద్ పాషా, బొడ్డు రమేష్, చల్లా రవీందర్ రెడ్డి, శేషగిరి, అక్తర్ పాషా, పానుగంటి సత్తయ్య, పి.రమేష్, సురేందర్, నూతి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కొత్తగూడెం ఎస్పీ ఎదుట లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టులు

**- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి-కొత్తగూడెం,**(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : చత్తీస్ ఘడ్ లోని బీజాపూర్‌కి చెందిన ఆరుగురు మావోయిస్టులు గురువారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ ఎదుట లొంగి పోయారు. భద్రాద్రి జిల్లా పోలీసులు, 81అండ్ 141 సిఆర్పిఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసి ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి, ఆపరేషన్ చేయూతలో భాగంగా నక్సలిజాన్ని వీడి తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని లొంగిపోయారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇప్పటివరకు ఆపరేషన్ చేయూతలో భాగంగా లొంగిపోయిన వారి సంఖ్య వీరితో కలిపి 320 మందికి చేరిందని ఎస్పీ వివరించారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆదివాసీల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం వారి ప్రాంతాల్లో రోడ్లు, స్కూల్స్ ,వైద్యశాలలు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తుందని ఎస్పీ చెప్పారు. ప్రతి మారుమూల గిరిజన గ్రామాలకు నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా వివరించారు. లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టులకు రూ.25 వేల రూపాయల చొప్పున తాత్కాలిక సహాయాన్ని అందజేశారు. మిగతా రూ.1,25,000లను వారికి ఆధార్, బ్యాంకు అకౌంట్ లు వచ్చిన తర్వాత వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఎస్పీ చెప్పారు. లొంగిపోయిన వారిలో చత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్ కి చెందిన మడకం దేవా అలియాస్ దినేష్, మడివి జోగా, పోడియం దేవా, మడకం ఇదుమాస్, మడకం ముక్కా, మడివి అయితాలు ఉన్నారు.




# సైగల భాష అందరూ నేర్చుకోవాలి

**- ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలి - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, **(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : సైగల భాష అందరూ నేర్చుకోవాలని, ప్రపంచమంతా యూనివర్సల్‌గా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అంతర్జాతీయ సైన్ లాంగ్వేజి వారోత్సవాలు ఈనెల 22 నుండి 28 వరకు నిర్వహించనున్నారు. విద్యానగర్లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ముందస్తు అంతర్జాతీయ సైన్ లాంగ్వేజి దినోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ భాషలు లేని కాలంలో సైగల ద్వారానే కమ్యూనికేషన్ ఉండేదని తెలిపారు. అందువల్ల సైన్ లాంగ్వేజిని చిన్నచూపు చూడొద్దని అన్నారు. ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజి ఉండడం ద్వారా అంతర్జాతీయంగా దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతుందని సూచించారు. దివ్యాంగుల భావాలను అర్థం చేసుకొని వారితో మెరుగైన కమ్యూనికేషన్ ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో అక్షయ్ ఆకృతి ఫౌండేషన్ ద్వారా అధికారులకు, ఉత్సాహం ఉన్నవారికి సైన్ లాంగ్వేజి నేర్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ భాష నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ సర్వీసులో ఒకసారైనా అంధుల, బధిరుల పాఠశాలల్లో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు ఇదివరకే టైలరింగ్, రైటింగ్ వంటి స్కిల్స్ లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, మొబైల్ రిపేరింగ్ వంటి రంగాల్లో కూడా వీరికి శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వెంకటేష్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. చట్టం ప్రకారం దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటివి అందజేయాలని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కచ్చితంగా అమలుపరచాలని అన్నారు.

దివ్యాంగుల చట్టాలను వారికి వివరించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కరీంనగర్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నేర్చుకోవడంతోపాటు అధికారులకు నేర్పించడం మంచి విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఈ.పి.ఐ.డి బాధ్యులు డాక్టర్ హిమాన్షు, ప్రియాంక, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జి సి డి ఓ కృపారాణి, తహసిల్దార్ నరేందర్, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ కమల పాల్గొన్నారు.



# దసరా నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్, **(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : దసరా నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష పేర్కొన్నారు. గురువారం జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రం బాసరలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజల అభ్యున్నతి కోసం అమ్మవారిని ప్రార్థించిన కలెక్టర్‌కు దేవస్థానం అర్చకులు ఆశీర్వచనం అందించి, సాంప్రదాయరీతిలో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయ పరిసరాలను అధికారులు, పూజారులతో కలిసి పరిశీలించారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లను పటిష్ఠంగా చేపట్టాలని సూచించారు. క్యూ లైన్లు, విఐపి క్యూ లైన్స్, అక్షరాభ్యాసం మండపాలు, దర్శనం, లడ్డు కౌంటర్లు, సీసీటీవీ కెమెరాలు, అన్నదానం, తాగునీరు, వసతి వంటి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్, సెక్యూరిటీ, శానిటేషన్, ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. లైటింగ్, పార్కింగ్, పూల అలంకరణ, పెయింటింగ్, నిరంతరం సానిటేషన్, మొబైల్ టాయిలెట్, వైద్య శిబిరం, పోలీస్ సెక్యూరిటీ, గోదావరి ఘాట్స్ వద్ద సౌకర్యాలు వంటి ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రహదారులను తక్షణం మరమ్మతులు చేయడంతో పాటు, ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్, దసరా నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తుల రద్దీ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆలయ చైర్మన్ శరత్ పటాక్, ఏ ఎం సి చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సబ్ కలెక్టర్, ఆలయ ప్రత్యేక అధికారి సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజని దేవి, డిపి ఓ శ్రీనివాస్, పవనచంద్రతో పోలీస్, ఫైర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.




# పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీ తప్పనిసరి

**- లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, **(ఆకాంక్ష న్యూస్)**సెప్టెంబర్ **18** : ప్రభుత్వ, ప్రైవేటు, సంస్థలు కంపెనీలు, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై జెడ్పీ సమావేశ మందిరంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యులకు వర్క్ షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పది మంది కంటే ఎక్కువ కార్మికులు లేదా ఉద్యోగులు ఉన్న అన్ని సంస్థలు, కంపెనీలు కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు పూర్తి చేయాలన్నారు. కమిటీ సభ్యుల వివరాలు, ఫోన్ నెంబర్లు, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. పది మంది కంటే తక్కువ కార్మికులు లేదా ఉద్యోగులు ఉంటే వారిని జిల్లా లేదా మండల నోడల్ యూనిట్లో చేర్చాలన్నారు. ప్రైవేట్ సెక్టార్లకు సంబంధించి సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను పర్యవేక్షించాలని ఆదేశించారు. వీటి పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితురాలు తప్పనిసరిగా తమ సంస్థ లేదా కార్యాలయంలోని ఐసీసీలో ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంటాయని అన్నారు. అదే తరుణంలో మహిళలకు మేలు చేసే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయరాదని సూచించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ జిల్లా స్థాయి కమిటీకి అనుబంధంగా ఉంటుందని తెలిపారు.

ఐసీసీలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కమిటీకి తీసుకురావచ్చని సూచించారు. వేధింపులకు గురైన మహిళ 90 రోజుల్లోగా తన ఫిర్యాదును సమర్పించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ మాట్లాడుతూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ, జిల్లా స్థాయి ఫిర్యాదుల కమిటీ విధులు, బాధ్యతలను వివరించారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంలోని పూర్తి అంశాలపై కార్యక్రమానికి హాజరైన అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ స్వరూపారాణి, సిడిపిఓ సబిత, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, అడిషనల్ డీఎంహెచ్వో సుధా, అడిషనల్ డిఆర్డీవో రవికుమార్, ట్రస్మా చైర్మన్ శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు




# రాష్ట్ర ప్రభుత్వ కనుసన్నల్లో సింగరేణి లాభాలు తగ్గించే కుట్ర

**- 35 శాతం లాభాల వాటా ఇవ్వకుంటే... సింగరేణిని స్థంబింపచేస్తాం**

**- ఎస్‌సిఎంకెఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ అప్పాని హెచ్చరిక**

భూపాలపల్లి, **సెప్టెంబర్ 18** : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన సింగరేణి లాభాలను రాష్ట్ర ప్రభుత్వ కనుసన్నల్లో తక్కువగా చూపించే కుట్రలు కొనసాగుతున్నట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఎస్‌సిఎంకెఎస్) వర్కింగ్ ప్రసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక బిఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల లాభాల విషయంలో అవకతవకలకు పూనుకుంటే సింగరేణిని స్థంబింపచేస్తామని కోల్ మైన్స్ కార్మిక సంఘ్ హెచ్చరిస్తున్నదని ఆయన అన్నారు. సింగరేణిలో గత సంవత్సరం రూ.4,701 కోట్ల లాభం వచ్చినా, యాజమాన్యం కేవలం రూ.2,412 కోట్లను మాత్రమే చూపించి, కార్మికులకు 33 శాతం వాటాలో అన్యాయం చేసిందని, సింగరేణి యాజమాన్యం గత సంవత్సరానికి సంబందించిన ఆడిట్ షీట్ ఇంకా విడుదల చేయకపోవడంతో అనేక అనుమానాలు దాగివున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నెల 20 లోపు సింగరేణి కార్మికులకు 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలబోయిన సుజెందర్ , బ్రాంచి కార్యదర్శి రేణుకుంట్ల మల్లేష్, రాసకట్ల నర్సింగరావు, ఈర్ల సదానందం, అల్లం శ్రీనివాస్, రఘుపతి రెడ్డి, రాసకట్ల సాగర్, సదానందం, తాండ్ర మొగిలి పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న పద్ధతుల్లో విద్యా బోధన

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకట్టుకున్న టిఎల్ఎం మేళా**

కరీంనగర్, **(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో విభిన్న పద్ధతులను అనుసరించి విద్యాబోధన చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా తయారుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ జిల్లాస్థాయి మేళాను కలెక్టర్ సందర్శించారు.పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు వివిధ సబ్జెక్టుల వారీగా తయారుచేసిన టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ఎంపిక మండల స్థాయిలో పూర్తయింది. మండలానికి పది పాఠశాలలను జిల్లా స్థాయికి ఎంపిక చేసి గురువారం మేళా ఏర్పాటుచేశారు. ఈ మేళాలో ఎంపికైన పాఠశాలల మెటీరియల్ రాష్ట్రస్థాయిలో జరిగే మేళాలో ప్రదర్శించనున్నారు. తక్కువ ఖరీదుతో విద్యార్థులకు ఎక్కువ జ్ఞానం పెంపొందించే ఈ మెటీరియల్ ఎంతగానో ఆకట్టుకుంటున్నదని తెలిపారు.




# ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

రామగుండం, **(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే మన ప్రభుత్వా లక్షమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం పాలకుర్తి మండలం బసంత్ నగర్ లో మెగా వైద్య శిబిరాన్ని మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ సతీమణి మనాలి ఠాకూర్ కాంగ్రెస్ నాయకులకుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల ఆరోగ్య శ్రీ తో పాటు ఎల్ఓసి ఇస్తున్నామని ప్రజలకు మెరుగైన వైద్యం అందించ్చేందుకు నిరంతరం చూస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తెస్తున్నామని అధిక శాతం కార్మిక కుటుంబాలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా వ్యాధులను గుర్తించి మెరుగైన వైద్య సేవల కోసం అవసరమైతే హైదరాబాద్ ఆస్పత్రులకు పంపిస్తామని ఎవరు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భరోసా కల్పించారు. అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్యులు శిబిరంలో ఉన్నారని వారి వైద్య సేవలను ఉపయోగించుకోవాలని, ఆరోగ్యం విషయంలో అందరూ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సూచించారు.

ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు క్యాస శ్రీనివాస్, లక్ష్మీ వాణి, నాగిరెడ్డి, అనీష్, పబ్బా రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, రాజీవ్, గోపి కాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, నాయకులు సూర సమ్మయ్య, బయ్యపు మనోహర్ రెడ్డి, తలారి శంకర్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

## - పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంపై అవాస్తవాలు మాట్లాడడం మానుకోవాలి

## - వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

వనపర్తి, **(ఆకాంక్ష న్యూస్)**సెప్టెంబర్ **18** : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమని వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘా రెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని, పత్రికలపై మాత్రమే పనులు చూపించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మొత్తం రూ.60,62,79,058 విలువ గల చెక్కులను 10,073 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అందులో 5,458 మంది సి.ఎం.ఆర్.ఎఫ్ లబ్ధిదారులకు రూ.12,16,36,850, 4,338 మంది కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు రూ.43,43,02,208, అలాగే 277 మంది ఎల్ఓసి లబ్ధిదారులకు రూ.5,03,40,000 విలువైన చెక్కులు అందజేశారు. వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఆయన, కేవలం 22 నెలల పాలనలోనే 33,860 మంది రైతులకు రూ.253 కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. సుమారు రూ.2,400 కోట్ల నిధులతో వనపర్తిలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, పెబ్బేరు 50 బేడెడ్ హాస్పిటల్, అర్బన్ మరియు రూరల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేపట్టామన్నారు. అదనంగా అమృత 2.0 పథకం ద్వారా వనపర్తి, పెబ్బేరు మండలాలకు 20 సంవత్సరాల పాటు నీటి సమస్యలు రాకుండా రూ.80 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. "విద్యా రంగ అభివృద్ధి కోసం రూ.50 కోట్లు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి మరో రూ.60 కోట్లు కేటాయించామని ఎమ్మెల్యే చెప్పారు. స్థానికంగా చేపట్టిన ఈ అభివృద్ధి పనులు పేదల సంక్షేమానికి, ప్రజల అవసరాలకు దోహదం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించారని, స్థానిక ఎన్నికల్లో కూడా వారికి అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం, వనపర్తి అభివృద్ధి అంశాలపై బీఆర్ఎస్ అవాస్తవాలు ప్రచారం చేస్తోందని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గ్రూప్ వన్ నియామకాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, ఆయనపై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మహిళా విభాగ జిల్లా అధ్యక్షులు రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు శంకర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బి.కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ చందాపురం బాలస్వామి, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు

## - ఇల్లందు డిఎస్పీ చంద్రభాను

## - ఇల్లందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం



ఇల్లెందు/కొత్తగూడెం, **(ఆకాంక్ష న్యూస్)** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లందు సబ్ డివిజన్ డిఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రభాను ఆధ్వర్యంలో గురువారం ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని వినోభా నగర్ లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 250 ఇండ్లలో సోదాలు చేశారు. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 70 ద్విచక్ర వాహనాలను, 03 ఆటోలను, ఒక కారును సీజ్ చేశారు. వినోభా నగర్ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇల్లందు డిఎస్పి చంద్రభాను పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా, తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని డిఎస్పీ చెప్పారు. విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డిఎస్పీ సూచించారు. సుమారు 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

## - తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్

జనగామ,**(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో క్రిస్టియన్ ప్రజల సమస్యలపై జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్ కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)బెన్ షాలోమ్ లతో కలిసి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్ పాస్టర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద క్రిస్టియన్ సోదరులకు అందే విధంగా ప్రతి ఆదివారం చర్చిలలో తెలియజెప్పాలని సూచించారు. అదే విధంగా సంఘాలలో విస్తృతంగాప్రచారం చేపట్టాలన్నారు.



# స్వచ్ఛతయే మన నినాదం ఆరోగ్యమే అన్నింటికన్నా ప్రధానం

## ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ,**(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18**: స్వచ్ఛతయే మన నినాదం ఆరోగ్యమే అన్నింటికన్నా ప్రధానమని ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వ తారీఖు వరకి నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ-2025 పక్షోత్సవాలలో భాగంగా బచ్చన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ బచ్చన్నపేట ప్రధాన కూడలిలో విద్యార్థులు, మహిళా సంఘ సభ్యుల, గ్రామ ప్రజలచేత మానవహారం, ర్యాలీ, స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించి తదనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్లో సుమారు 600 మంది తో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతయే మన నినాదం-ఆరోగ్యమే అన్నింటికన్నా ప్రధానం అని అన్నారు.

అందుకు ప్రతీ ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని , పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో స్వచ్ఛత పై నిర్వహించిన రంగోళి, చిత్రలేఖనం పోటీల ని తిలకించి విజేతలకి బహుమతులని ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో డీపీవో స్వరూప, డిసి-ఎస్‌బిఎం కర్ణాకర్, ఎంపీడీఓ, ఎంపీవో మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# సరిపడా యూరియా నిల్వలు - రైతులకు ఇబ్బంది కలగద్దు

## - ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్



జనగామ,**(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : సరిపడా యూరియా నిల్వలున్నాయని, రైతులకు ఇబ్బంది కలగద్దొని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ తెలిపారు. గురువారం బచ్చన్నపేట మండలం కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భౌతిక నిల్వలతో పాటు స్టాక్ రిజిస్టర్, రైతు వారి సేల్ రిజిస్టర్ను ఇంచార్జ్ కలెక్టర్ పరిశీలించారు క్రౌడ్ కాకుండా... రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా యూరియా పంపిణీ చేయాలన్నారు. ఇప్పటివరకు బచ్చన్నపేట మండలంలోని తొమ్మిది కేంద్రాల ద్వారా, సబ్ సెంటర్ల ద్వారా రైతులందరికీ యూరియా సరఫరా చేయడం జరుగుతుందని... బచ్చన్నపేట మండలంనకు ఇప్పటివరకు వివిధ డీలర్ల ద్వారా 848 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా జరిగిందన్నారు. ఈ సెప్టెంబర్ మాసానికి గాను బచ్చన్నపేట మండలానికి 270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరానికి గాను ఇప్పటివరకు 198 మెట్రిక్ టన్నుల యూరియా అయ్యిందన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీన్, ఇందిరమ్మ ఇళ్ల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించి వేగవంతం చేయాలని ఆదేశించారు

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



జనగామ,**(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : వికారాబాద్ జిల్లాలో ఈవీఎం గోడౌన్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. గురువారము రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నందున పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. ముందుగా పోలీస్ వారిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌లతో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల వారితో మాట్లాడారు. బిఎల్ఓల పేర్లు ఇచ్చారా, ఓటరు జాబితా పూర్తి అయినదా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డిఆర్ఓ మంగి లాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర, ఉన్నారు.

# అసంపూర్తిగా ఉన్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

## - ఎండపల్లి ఎంపీడీవో కు వినతి పత్రం అందజేసిన గొల్లకోట వాస్తవ్యురాలు



ధర్మపురి, **(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలంలోని గుల్లకోట గ్రామంలో అసంపూర్తిగా నిర్మాణ దశలో ఉన్న నూతన గ్రామపంచాయతీ భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగేట్లు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎండపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి గుల్లకోట గ్రామ వాస్తవ్యురాలు బెత్తపు శ్రీజ లక్ష్మీరాజం వినతి పత్రం అందజేశారు. పాత గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, దాని పై కప్పు పెచ్చులు ఊడి వర్షానికి ఊరుస్తుందని, తద్వారా గ్రామపంచాయతీ రికార్డులకు రక్షణ లేకుండా పోతుందని, వర్షం కురిసే సమయంలో గ్రామపంచాయతీలో నిలుచోడానికి కూడా ఆస్కారం లేకుండా వర్షపు నీటితో నిండి పోతుందని, ఏ క్షణాన కూలిపోతుందోననే ప్రమాదపుటంచున పాత గ్రామపంచాయతీ భవన పరిస్థితి ఉందని ఫిర్యాదుదారురాలు శ్రీజ పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని కొన్ని వార్డుల్లో వర్షాకాల సమయంలో గుంతలు గుంతలుగా ఏర్పడి, బురదతో కూడిన నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, వెంటనే ఆయా వార్డుల్లో శానిటేషన్ చేయించాలని, రోడ్లకు మరమ్మత్తులు చేయించి, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోను కోరారు.




# స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌కు విశేష స్పందన

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, **(ఆకాంక్ష న్యూస్)** సెప్టెంబర్ **18** : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పాపన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్ సి)లో నిర్వహిస్తున్న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి,వైద్య సౌకర్యాలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన కుటుంబమే దేశ సంక్షేమం అని అన్నారు. మహిళలు తమ కుటుంబం బాగుండాలని నిరంతరం సేవలందిస్తూ తన ఆరోగ్యంపై అశ్రద్ధ చూపుతున్నదని, అటువంటి మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని దేశవ్యాప్తంగా మహిళలకు పెద్దపీట వేస్తూ స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కు రూపకల్పన చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని,కుటుంబం సంతోషంగా ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. శ్రద్ధ తీసుకోకపోవడంతో జన్మించే శిశువులు ఆరోగ్యవంతులుగా ఉండకపోవడం జరుగుతున్నదని,శిశువులను సంపూర్ణ ఆరోగ్యం గా తీర్చిదిద్దేందుకు మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే దృఢంగా ఉంటారని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని చూడగలుగుతామన్నారు.

# ఆరోగ్యం



## వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే ఈ పండ్లు తినాలి

వర్షాకాలంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఒకవైపు మనసుకు హాయినిచ్చినా, మరోవైపు అనేక ఆరోగ్య సమస్యలను, ముఖ్యంగా జలుబు, దగ్గు వంటి వాటిని మోసుకొస్తుంది. వర్షాకాలం మొదలవగానే చాలా ఇళ్లలో వినిపించే మొదటి మాట జలుబు చేస్తుంది, పండ్లు తినొద్దు. ముఖ్యంగా నారింజ, అరటిపండు, పుచ్చకాయ వంటి పండ్లను పూర్తిగా దూరం పెడతారు. కానీ ఇది కేవలం ఒక అపోహ మాత్రమేనని, వాస్తవానికి ఈ కాలంలో మనల్ని ఆరోగ్యంగా ఉంచే శక్తి పండ్లకు ఉందని నిపుణులు చెబుతున్నారు. పండ్లు తింటే జలుబు వస్తుందన్నది శాస్త్రీయంగా నిరూపితం కాని విషయం. నిజానికి పండ్లలో ఉండే విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు మన శరీర రోగనిరోధక శక్తిని ఒక కవచంలా కాపాడతాయి. బలమైన రోగనిరోధక వ్యవస్థ మనల్ని వర్షాకాలంలో వచ్చే ఇన్ఫెక్షన్ల బారి నుండి కాపాడుతుంది. కాబట్టి పండ్లను శత్రువులుగా కాకుండా, మన ఆరోగ్య మిత్రులుగా భావించాలి. ఈ విషయంపై తమిళనాడుకి చెందిన ప్రముఖ డాక్టర్ కార్తికేయన్ సోషల్ మీడియా ద్వారా ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు. డాక్టర్ కార్తికేయన్ ప్రకారం జలుబు రాకుండా నివారించాలన్నా, ఇప్పటికే వచ్చిన జలుబు నుండి త్వరగా కోలుకోవాలన్నా కొన్ని ప్రత్యేకమైన పండ్లను తప్పక తీసుకోవాలి.

యాపిల్ యాపిల్స్ లో ఫ్లేవనాయిడ్లు అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని కణాలను దెబ్బతినకుండా కాపాడటమే కాకుండా వైరస్ లతో పోరాడే శక్తిని పెంచుతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో కూడా ఇవి సహాయపడతాయి. కాబట్టి జలుబు భయంతో యాపిల్ ను పక్కన పెట్టకండి.

అరటిపండు అరటిపండు తింటే జలుబు ఎక్కువవుతుందన్నది మరో పెద్ద అపోహ. వాస్తవానికి అరటిపండులో పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది శరీరంలోని ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడి, నీరసం నుండి బయటపడేస్తుంది. అంతేకాకుండా ఇది సులభంగా జీర్ణమై, జలుబుతో బాధపడుతున్నప్పుడు తక్షణ శక్తిని అందిస్తుంది. ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతతను ఇవ్వడంలో కూడా అరటిపండు సహాయపడుతుంది. బలహీనపడిన రోగనిరోధక వ్యవస్థకు ఒత్తిడి ఒక కారణం కాబట్టి అరటిపండు తినడం ఎంతో మేలు. నారింజ,నిమ్మ జలుబు అనగానే అందరూ భయపడేవి సిట్రస్ పండ్లు. కానీ వీటిని మించిన ఔషధం లేదు. నారింజ, నిమ్మ వంటి పండ్లలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఈ విటమిన్ సి మన రోగనిరోధక వ్యవస్థకు ప్రాణం లాంటిది. ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి, ఇన్ఫెక్షన్లతో పోరాడే మన శరీర సామర్థ్యాన్ని అమాంతం పెంచుతుంది. కాబట్టి జలుబు చేసినప్పుడు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగడం లేదా నారింజ పండు తినడం వల్ల త్వరగా కోలుకుంటారు. ఫైనాపిల్ ఫైనాపిల్ లో బ్రోమెలైన్ అనే ఒక ప్రత్యేక ఎంజైమ్ ఉంటుంది. దీనికి యాంటీ ఇన్ ఫ్లమేటరీ (వాపును తగ్గించే) గుణాలు ఉన్నాయి. ఇది గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ వంటి జలుబు లక్షణాల నుండి ఉపశమనం కలిగిస్తుంది. దీనిలో కూడా విటమిన్ సి, ఫ్లేవనాయిడ్లు అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

పుచ్చకాయ పుచ్చకాయలో నీరు ఎక్కువగా ఉంటుందని, ఇది జలుబుకు కారణమవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ జలుబు చేసినప్పుడు శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ఉండటం చాలా ముఖ్యం. పుచ్చకాయ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. దీనిలో ఉండే లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి అనారోగ్యం నుండి త్వరగా కోలుకునేలా చేస్తుంది. దానిమ్మ దానిమ్మ గింజలు యాంటీఆక్సిడెంట్లు, యాంటీ వైరల్ గుణాలతో నిండి ఉంటాయి. ఇవి వర్షాకాలంలో వచ్చే వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి. రక్తహీనతను తగ్గించి, శరీరానికి బలాన్నిస్తాయి. వీటితో పాటు కొబ్బరి నీళ్లు, ఖర్జూరాలను కూడా ఆహారంలో చేర్చుకోవాలి. కొబ్బరి నీళు సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్ డ్రింక్ లా పనిచేసి శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. ఖర్జూరాలు తక్షణ శక్తిని అందించి, నీరసాన్ని దూరం చేస్తాయి.

## గుత్తి వంకాయ దమ్ బిర్యానీ



**ఈరోజుల్లో చాలామంది ఆరోగ్యం కోసం శాకాహార వంటకాలను ఇష్టపడుతున్నారు. అందులో భాగంగా శాఖాహారంలోనే రుచి, ఆరోగ్యం రెండూ లభించేలా ఎన్నో రకాల వంటకాలను ప్రయత్నిస్తున్నారు. అలాంటి అద్భుతమైన వంటకాల్లో ఒకటి గుత్తి వంకాయ దమ్ బిర్యానీ. ఇది దక్షిణ భారతదేశంలో బాగా ప్రాచుర్యం పొందిన వంటకం. ఈ బిర్యానీ సాధారణ బిర్యానీలకు భిన్నంగా ఉంటుంది. దీనిలో గుత్తి వంకాయలను మసాలాలతో నింపి, బిర్యానీతో దమ్ చేయడం వల్ల దీనికి ప్రత్యేకమైన రుచి వస్తుంది. గుత్తి వంకాయ దమ్ బిర్యానీ ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.**

-బియ్యం -వంకాయలు -ఉల్లిపాయలు -వెల్లుల్లి -పచ్చిమిర్చి -పుదీనా ఆకులు -కొత్తిమీర ఆకులు -మసాలా దినుసులు -నెయ్యి -నూనె -ఉప్పు -కారం పొడి -వేరుశెనగలు -అల్లం -ధనియాల పొడి -జీలకర్ర పొడి

గుత్తి వంకాయ దమ్ బిర్యానీ తయారీ విధానం -ముందుగా 2 కప్పుల బాస్మతి బియ్యం(400 గ్రా)శుభ్రంగా కడిగి తర్వాత నీళ్లు పోసి అరగంట సేపు నానబెట్టాలి.

-బియ్యం నానేలోగా 12 నల్లటి గుత్తి వంకాయలు తొడిమను కొంచెం కట్ చేసి వంకాయను నాలుగు గాట్లుగా పెట్టి ఉప్పు నీళ్లలో వేసుకోండి. -అన్ని వంకాయలను నాలుగు గాట్లుగా పెట్టి ఉప్పు నీళ్లలో వేసుకోండి. -తర్వాత మిక్సీ జార్ లో 1 ఇంచు అల్లం ముక్కలు, పొట్టు తీసేసిన 15 వెల్లుల్లి రెబ్బలు, 5 లవంగ మొగ్గలు, చిన్న దాల్చిన చెక్క, 4 యాలకలు, వేయించిన 3 టేబుల్ స్పూన్ల పల్లీలు,2 టీస్పూన్ల కారం, 5 పచ్చిమిరపకాయలు, ఒకటిన్నర టీస్పూన్ ధనియాల పొడి, పావు టీస్పూన్ పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి నీళ్లు లేకుండానే మెత్తగా గ్రైండ్ చేయండి.

-ఇప్పుడు కట్ చేసుకున్న వంకాయల్లోకి మిక్సీలో వేసి చేసుకున్న మసాలా పేస్ట్ ని స్టఫ్ చేసుకోండి. మిగిలిన దాన్ని పక్కన పెట్టుకోండి -తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల ఆయిల్, 1 టేబుల్ స్పూన్ నెయ్యి పోసి వేడి చేసి ఇందులో సన్నగా తరిగిన 1 కప్పు ఉల్లిపాయలు వేసి ఫ్రై చేసుకోండి. -ఉల్లిపాయలు వేగాక వాటిని ఓ ప్లేట్ లోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద పాన్ లో మిగిలి ఉన్న ఆయిల్ లోనే స్టఫ్ చేసిన వంకాయలను వేసి కలిపి మూతపెట్టి తక్కువ మంటమీద 5 నిమిషాలు ఉడికించాలి. -వంకాయల్లో స్టఫ్ గా పెట్టగా మిగిలిపోయిన మసాలా ముద్దలో ముప్పావు కప్పు పెరుగు,1 టీస్పూన్ బిర్యానీ మసాలా, 8 క్రష్ చేసిన మిరియాలు వేసి బాగా కలపండి.

-ఇప్పుడు పాన్ లో వంకాయలు 70 శాతం ఉడికితే అందులో బిర్యా ఆకులు 2, మరాఠీ మొగ్గలు 2, షాజీరా, రాతి పువ్వు, స్టార్ అనాస, కొంచెం దాల్చిన చెక్క,ఫ్రై చేసి పెట్టిన ఉల్లిపాయలు వేసి అన్నీ బాగా కలిసేలా కలుపుకోండి. -ఇప్పుడు అందులో కలిపి పెట్టిన మసాలా పెరుగు వేసి ఇందులోనే పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు వేసి నిదానంగా కలుపుతూ 2 నిమిషాలు ఉడికించి స్టవ్ ఆఫ్ చేసేయండి. -ఇప్పుడు అందులో అర చెక్క నిమ్మరసాన్ని చుట్టూర పిండుకోండి. -ఇప్పుడు అన్నం వండడానికి సరిపడా గిన్నెను తీసుకొని అందులో సగానికి పైగా నీళ్లు పోసి 1 టీస్పూన్ షాజీరా, 2 బిర్యానీ ఆకులు, చిన్న దాల్చిన చెక్క, 2 యాలకలు, కొద్దిగా రాతి పువ్వు, 10 మిరియాలు, 2 చీల్చిన పచ్చిమిరపకాయలు, రుచికి సరిపడా ఉప్పు, 2 టీస్పూన్ల నెయ్యి లేదా ఆయిల్ వేసి నీళ్లను మరిగించాలి. -నీళ్లు మసలుతున్నప్పుడు అందులో నానబెట్టిన బాస్మతి బియ్యం వేసి మధ్య మధ్యలో కలుపుతూ 80 శాతం వరకు ఉడకనిచ్చి స్టవ్ ఆఫ్ చేసేయండి. -తర్వాత పెద్ద కడాయిని స్టవ్ మీద పెట్టి అందులో అర టీస్పూన్ నెయ్యి వేసి స్ప్రెడ్ చేసి ఉడికించిన అన్నాన్ని ఇందులో వేయండి. ఇందులో ఫ్రై చేసిన ఉల్లిపాయలు కొన్ని, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగే, రెడీ చేసిన గుత్తివంకాయ మసాలా మొత్తం వేసేయండి. 2 టీస్పూన్ల నెయ్యిని బిర్యానీ మద, అలాగే వేడి నీళ్లలో నానబెట్టిన చిటికెడు కుంకుమ పువ్వును నానబెట్టిన నీళ్లతో సహా ఇందులో వేసేయండి. మూతపెట్టి 10 నిమిషాలు తక్కువ మంటమీద దమ్ చేయండి. తర్వాత మూత తీస్తే టేస్టీ వంకాయ దమ్ బిర్యానీ రెడీ.

## కమ్మనైన పనసపండు పాయసం



పనసపండు పాయసం..కేరళలో చాలా ప్రసిద్ధి చెందిన ఒక సాంప్రదాయక వంటకం. దీనిని మలయాళంలో చక్కా పాయసం అని కూడా అంటారు. పనసపండు రుచిని ఇష్టపడేవారికి ఇది ఒక అద్భుతమైన వంటకం. దీనిని ఉడికించిన పనస తొనలు, బెల్లం, కొబ్బరి పాలు, నెయ్యి, యాలకులు కలిపి తయారు చేస్తారు. దీనిని సాధారణంగా ఓనం, విశు వంటి పండుగల సమయంలో లేదా ఏదైనా ప్రత్యేక సందర్భాలలో తయారు చేస్తారు. దీని రుచి చాలా ప్రత్యేకంగా, మధురంగా, కమ్మగా ఉంటుంది. ఈ వంటకాన్ని తయారు చేయడం కొంచెం సమయం తీసుకుంటుంది కానీ దాని రుచికి అది పూర్తిగా విలువైనది. ఈ పాయసం చేయడానికి తాజా పనసపండు చాలా ముఖ్యం. పండు బాగా పండినది, తీయగా ఉన్నది అయితే పాయసం రుచి చాలా బాగుంటుంది. పనసపండు పాయసం ఎలా తయారుచేయాలో ఇక్కడ చూడండి.

పనసపండు పాయసం తయారీకి కావలసిన పదార్థాలు పనసపండు తొనలు: 1 కప్పు (250 గ్రాములు బాగా పండినవి) బెల్లం: 1.5 కప్పులు

కొబ్బరి పాలు: మొదటి పాలు (చిక్కనివి): 1 కప్పు రెండో పాలు (పలచనివి): 2 కప్పులు మూడో పాలు (మరింత పలచనివి): 2 కప్పులు నెయ్యి: 4-5 టేబుల్ స్పూన్లు యాలకుల పొడి: 1 టీస్పూన్ ఎండు అల్లం పొడి (సొంఠి): 1/2 టీస్పూన్ జీలకర్ర పొడి: 1/4 టీస్పూన్ అలంకరణ కోసం: జీడిపప్పు: 10-15 కిస్మిస్: 10-15 కొబ్బరి ముక్కలు: 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం ఒక పెద్ద కొబ్బరికాయ (రెండు బద్దలు) లేదా 2 కప్పుల తురిమిన కొబ్బరి తీసుకోండి. కొబ్బరి తురుముని మిక్సీ జార్ లో వేసి, అర కప్పు వేడి నీళ్లు పోసి మెత్తగా రుబ్బండి. ఈ మిశ్రమాన్ని ఒక వడపోత వస్త్రం లేదా జల్లెడలో వేసి గట్టిగా పిండి చిక్కని పాలు తీసుకోండి. ఇది సుమారు 1 కప్పు వస్తుంది. ఈ పాలను పక్కన పెట్టండి. అదే కొబ్బరి పిప్పిలో 1.5 కప్పుల వేడి నీళ్లు పోసి మళ్లీ రుబ్బండి. ఇప్పుడు దానిని పిండి రెండో పాలు తీసుకోండి. ఇది సుమారు 2 కప్పులు వస్తుంది. అదే పిప్పిలో మళ్లీ 1.5 కప్పుల నీళ్లు పోసి రుబ్బి, పిండి మూడో పాలు తీసుకోండి. ఇది కూడా సుమారు 2 కప్పులు వస్తుంది. ఈ మూడు రకాల కొబ్బరి పాలను విడివిడిగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే వాటిని పాయసంలో చేర్చే క్రమం వేరుగా ఉంటుంది. ఇప్పుడు పనస తొనల గింజలు తీసి, చిన్న చిన్న ముక్కలుగా తరుగుకోండి. ఈ పనసపండు ముక్కలను ఒక ప్రెషర్ కుక్కర్ లో వేసి, ముక్కలు మునిగే వరకు నీళ్లు పోసి 2-3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. ఇలా చేయడం వల్ల పనసపండు మెత్తగా అవుతుంది. కుక్కర్ చల్లారాక పనసపండు ముక్కలను బయటికి తీసి, నీళ్లు ఒంపేయండి. ఇప్పుడు ఈ ఉడికించిన పనసపండు ముక్కలను మిక్సీ జార్ లో వేసి, మెత్తని గుజ్జులా రుబ్బండి. ఒక గిన్నెలో బెల్లం, అర కప్పు నీళ్లు పోసి స్టవ్ మీద పెట్టండి. బెల్లం పూర్తిగా కరిగే వరకు వేడి చేయండి. కరిగిన బెల్లాన్ని వడపోసి అందులో ఉన్న మలినాలు తొలగించండి. బెల్లం పాకాన్ని పక్కన పెట్టండి. ఒక మందపాటి అడుగున్న గిన్నె లేదా నాన్ స్టిక్ పాన్ స్టవ్ మీద పెట్టి 3 టేబుల్ స్పూన్ల నెయ్యి వేయండి. నెయ్యి వేడి అయ్యాక పనసపండు గుజ్జును అందులో వేసి బాగా కలపండి. ఈ గుజ్జును నెయ్యిలో సుమారు 10-15 నిమిషాలు మీడియం మంట మీద వేయించండి. గుజ్జు రంగు కొంచెం ముదురుగా మారి,నెయ్యి గుజ్జు నుంచి వేరుగా రావడం మొదలు పెట్టినప్పుడు అది సరిగ్గా వేగినట్లు లెక్క. ఇప్పుడు వడగట్టిన బెల్లం పాకాన్ని ఈ పనస గుజ్జులో పోసి బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని బెల్లం పాకం అంతా పనస గుజ్జులోకి ఇంకిపోయే వరకు ఉడికించండి. ఇది కూడా సుమారు 10-15 నిమిషాలు పడుతుంది. మిశ్రమం కొంచెం చిక్కగా మారుతుంది. ఇప్పుడు ముందుగా తయారు చేసి పెట్టుకున్న మూడో పాలు (పలచనివి) పోసి బాగా కలపండి. ఈ పాయసం మిశ్రమాన్ని మధ్యమధ్యలో కలుపుతూ 5-7 నిమిషాలు ఉడికించండి. తర్వాత రెండో పాలు (కొంచెం పలచనివి) పోసి కలపండి. ఈ దశలో మంటను తగ్గించి సిమ్ లో ఉంచాలి. పాయసం మరుగుతున్నప్పుడు స్టవ్ నుంచి తీసేయండి. చివరగా మొదటి పాలు (చిక్కనివి) పోసి బాగా కలపండి. ఈ చిక్కని పాలను పోసిన తర్వాత పాయసాన్ని ఎక్కువసేపు ఉడికించకూడదు, లేకపోతే పాలు విరిగిపోవచ్చు. స్టవ్ ఆఫ్ చేసిన వెంటనే ఈ పాలను పోయాలి. మరొక చిన్న పాన్ లో 1-2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి వేడి చేయండి. నెయ్యి వేడయ్యాక ముందుగా తరిగిన కొబ్బరి ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించండి. అదే పాన్ లో జీడిపప్పు, కిస్మిస్ వేసి వేయించండి. కిస్మిస్ ఉబ్బి, జీడిపప్పు బంగారు రంగు వచ్చాక స్టవ్ ఆఫ్ చేయండి. ఈ తాళింపును పాయసంలో వేసి కలపండి. చివరగా యాలకుల పొడి, ఎండు అల్లం పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపండి. ఈ సుగంధ ద్రవ్యాలు పాయసానికి చాలా ప్రత్యేకమైన రుచిని ఇస్తాయి. కమ్మనైన, రుచికరమైన పనసపండు పాయసం సిద్ధం.

# సినిమా న్యూస్



# పార్టీ సాంగ్‌లో సింహం చిందులు!



నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ -2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లో నవంబర్ కల్లా అన్ని పనులు పూర్తి చేసి డిసెంబర్‌లో రిలీజ్ చేయాలని పట్టుబట్టి పని చేస్తున్నారు. డిసెంబర్ 5న రిలీజ్ చేయాలనే ఓ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందుకు తగట్టే యూనిట్ షూటింగ్‌కి సంబం ధించి అన్ని పనులు పూర్తి చేస్తోంది. ఇప్పటికే మేజర్ ప్టార్ అంతా పూర్తయింది. పాటలు సహా కొంత భాగం మిగిలి ఉంది. ప్రస్తుతం యూనిట్ ఆ పెండింగ్ షూట్‌ని ముగించే పనిలో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం బయటకు వచ్చింది. ప్రస్తుతం మేకర్స్ ఓ పార్టీ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. నేటి నుంచే ఈ పాట షూట్ మొదలైంది. ఈ పాట కోసం హైదరాబాద్‌లోనే ప్రత్యేకంగా ఓ స్పెషల్ సెట్ వేసి అందులోనే మొదలు పెట్టారు. వారం రోజులు పాటు ఈ పాట చిత్రీకరణ ఉంటుంది. ఈ వ్యవధి లోనే పెండింగ్ సన్నివేశాలు కూడా పూర్తి చేయాలని టీమ్ భావిస్తోంది. అందుకు సంబంధించి మరో టీమ్ పని చేస్తోంది. ఇక పాట విషయానికి వస్తే హిందుత్వం కాన్సెప్ట్‌తో తెరకెక్కు తోన్న చిత్రంలో పార్టీ సాంగ్ అన్నది ఇంట్రెస్టింగ్. బాలయ్య చిత్రంలో ఎలాగూ డ్యేయెల్ రోల్ పోషిస్తారు. అందులో ఓ రోల్ కుటుంబ అనుబంధాల నేపథ్యంలో సాగుతోంది. ఆ పాత్రలో కుటుంబం..సమాజాన్ని కాపాడే పాత్రలో బాలయ్య కనిపిస్తారు. ఆ పాత్రలో నవ రసాలు ఉంటాయి. అందులో భాగంగా బాలయ్యపై ఈ పార్టీ సాంగ్ ఉంటుందని తెలు స్తోంది. మరి ఈ పార్టీ సాంగ్లో నర్తించే బ్యూటీ ఎవరు? అన్నది ఆసక్తికరం. బాలయ్యపై ఇలాంటి సాంగ్ అంటే ఐటం భామ కూడా అంతే ఫేమస్ అవ్వాలి. కానీ అఖండ కాన్సెప్ట్ కావడంతో ఇంత వరకూ ఐటం పాటకు సంబంధించి పెద్దగా చర్చ ఎక్కడా జరగలేదు. సినిమా ఆరంభం నుంచి ముగిపు వరకూ కుంభమేళా, కాశీ, గుడులు గోపురాలు అనే ప్రచారమే హైలైట్ అయింది. ఐటం పాట ఉంటుంది? అన్న ఆలోచన కూడా ఎవరికీ రాలేదు. తాజా లీక్ మాస్ అభిమానుల్లో హుషారును నింపేదే. బాలయ్య సినిమా అంటే ఐటం సాంగ్ తప్పనిసరి. అందులో బాలయ్య ఐటం భామతో పోటీ పడే డాన్సులు అంతే హైలైట్. పైగా థమన్ సంగీతం అందిస్తున్న సినిమా కాబట్టి పార్టీ సాంగ్ ఎలా ఉంటుంది? అని ప్రత్యే కంగా చెప్పాల్సిన పనిలేదు.

# నష్టాలను అలా భర్తీ చేస్తున్నా హీరో మాత్రం తగ్గలే!



ఎంత పెద్ద స్టార్ సినిమా అయినా బాక్సాఫీస్ వద్ద అసలైన వసూళ్ల లెక్క అంత అన్నది ఎప్పటికీ మిస్టరీలాగే ఉంటుం దేమో. పోస్టర్లలో వేసినంత ఫిగర్ అక్కడికే పరిమితమని... థియేట్రికల్‌గా అంత ఉండదని పలువురు నిర్మాతలు అంటుం టారు. అదంతా కేవలం ప్రచారం వరకే పరిమితమంటారు. ఆ మధ్య ఓ తెలుగు బడా ప్రొడ్యూసర్ నోట కూడా ఇదే మాట వచ్చింది. ఆ లెక్క వేరు..మా లెక్క వేరు. అసలు లెక్క ఎంత? అన్నది మాత్రం ఏ నిర్మాత బయటకు చెప్పరని ఓపెన్ అయ్యారు. అప్పటి నుంచి పోస్టర్లలో వేసే నెంబర్లు ఏవీ నిజం కాదని ఓ ఐడియా ఏర్పడింది. అదంతా ప్రచారం కోసం చేసే డాబు తప్పు! దాని వెనుక ఎన్నో కారణాలుంటాయని అర్థమైంది. తాజాగా కోలీవుడ్ స్టార్ తల అజిత్ విషయంలో కూడా ఇదే అంశం చర్చనీయాంశంగా మారింది. అజిత్ గత సినిమా గుడ్ బ్యాడ్ అగ్లీ బాగానే ఆడింది. థియేట్రికల్‌గా మంచి వసూళ్లు రావడంతో నిర్మాతలు సహా అంతా మంచి లాభాలు చూసినట్లు అంతా భావించారు. కానీ అసలు లెక్క ఇదని తెరపైకి వస్తోంది. గుడ్ బ్యాడ్ అగ్లీ బడ్జెట్ 200 కోట్లుపైనే. వరల్డ్ వైడ్ థియేట్రికల్‌గా 240 కోట్లకు పైగా రాబట్టినట్లు వికీ సమాచారంతో తెలుస్తోంది. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ లెక్క 153 కోట్లు అని వెలుగులోకి వచ్చింది. దీంతో థియేట్రికల్‌గా ఈ సినిమా నష్టాలే మిగిల్చింది. కానీ ఓటీటీ మార్కెట్ కారణంగా సేఫ్ అయ్యారు. ఈసినిమా రైట్స్ ను 90 కోట్లకు పైగా కొన్నారు. ఆ కారణంగానే నిర్మాత థియేట్రికల్‌గా వచ్చిన నష్టాలను భర్తీ చేసినట్లు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమా కంటే ముందు అజిత్ నటించిన మరో చిత్రం విదాముయార్చీ కూడా రిలీజ్ అయింది. ఈ సినిమా బడ్జెట్ 185 కోట్లు. కానీ థియిట్రికల్‌గా 134 కోట్లు రాబట్టింది. కానీ ఓ టీటీలో బిగ్ డీల్ జరిగింది. నెట్ ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని ఏకంగా 100 కోట్లకు కొంది. అలా వచ్చిన నష్టాలు ఓటీటీ డీల్‌తో బ్యాలెన్స్ చేసారు. ఇలా రెండు సినిమాలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఆ సినిమాలకు అజిత్ కూడా భారీగానే పారితోషికం అందుకున్నట్లు తాజాగా వెలు గులోకి వస్తోంది. విదాముయార్చీ 100 కోట్లు తీసుకున్నాడని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏకె 64 చిత్రానికి కూడా భారీగా పారితోషికం పెంచి ఛార్జ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా బడ్జెట్ 300 కోట్లకు పైగానే ఉ ం టుందని... ఈ నేపథ్యంలో మార్కెట్ సహా బడ్జెట్ ఆధారం గానూ హైక్ చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. మరి ఈ ప్రచారంలో వాస్తవం తెలియాల్సి ఉంది.

# కల్కి నుంచి దీపికా అవుట్.. వంగా నవ్వేశాడా..?





ప్రస్తుతం కల్కి 2898%ూణ% సీక్వెల్‌కు సంబంధించిన ఒక అప్డేట్ గట్టిగానే వైరల్ అవుతోంది. వైజయంతి మూవీస్ కొద్దిసేపటి క్రితం చేసిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌లో హీరో యిన్ దీపికా పదుకొణె ఇకపై సీక్వెల్‌లో భాగం కాబోరని స్పష్టంగా ప్రకటించారు. ఈ వార్త టాలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో కూడా వైరల్ అయ్యింది. అయితే ఈ అనౌన్స్‌మెంట్ తర్వాత సోషల్ మీడియాలో ఒక ట్వీట్ పెద్దగా వైరల్ అయ్యింది. ఆ ట్వీట్‌ను కొందరు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పేరు మీదనని భావించి షేర్ చేయడం మొదలుపెట్టారు. ఆ ట్వీట్‌లోని నవ్వుతున్న ఎమోజీలతో పాటు ఉన్న స్టైల్ చూసి చాలా మంది అది నిజమని నమ్మారు. కానీ తర్వాత తెలిసింది ఏమిటంటే.. అది పూర్తిగా ఫేక్ అకౌంట్ నుంచి చేసిన పోస్ట్ అని. దీనివల్ల కొంతమంది నెటిజన్లు కన్ఫ్యూజ్ అయ్యారు. నిజంగానే సందీప్ దీపికా ఇష్యూ మీద రియాక్ట్ అయ్యాడని అనుకుని సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. అయితే దగ్గరగా గమనిస్తే ఆ అకౌంట్‌లో ఉన్న యూజర్ నేమ్ కూడా డైరెక్టర్ అధికారిక హ్యాండిల్ కాదని తేలిపోయింది. అంటే మొత్తం ఫేక్ ట్రిక్స్ వల్లే ఈ గందరగోళం సృష్టించబడింది. సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ మూవీ పనుల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతానికి ఎలాంటి రియాక్షన్ ఇవ్వకపోయినా, సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ఫేక్ పోస్ట్ కారణంగా మళ్లీ ఒకసారి చర్చ మొదలైంది. ముఖ్యంగా దీపికా సందీప్ మధ్య గతంలో వచ్చిన అపోహల కారణంగా ఈ ట్వీట్ మరింత ఫైరయ్యింది. నిజానికి టాప్ డైరెక్టర్స్, టాప్ హీరోల పేర్లతో ఇలా ఫేక్ అకౌంట్లు సృష్టించి ఫ్యాన్స్‌ను కన్ఫ్యూజ్ చేయడం కొత్తేమీ కాదు. కానీ ఇలాంటి సందర్భాల్లో నమ్మకమైన అధికారిక హ్యాండిల్స్‌ని మాత్రమే ఫాలో కావాలని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. లేకపోతే ఫేక్ పోస్ట్‌ల వల్ల తప్పుడు ప్రచారం జరిగి అనవసరమైన హడావిడి వస్తుంది. మొత్తానికి, కల్కి సీక్వెల్ నుంచి దీపికా ఔట్ అనేది నిజం కానీ, సందీప్ రెడ్డి వంగా ఫన్నీ ఎమోజీలతో స్పందించాడని సోషల్ మీడియాలో పాకిన వార్త మాత్రం పూర్తిగా ఫేక్. ఇప్పుడు ఫ్యాన్స్ అందరి ఫోకస్ మేకర్స్ ఎవరిని కొత్తగా హీరోయిన్‌గా తీసుకుంటారు అన్న దానిపైకి మళ్లింది. మరి కల్కి 2 గోల్డెన్ ఛాన్స్ ఎవరిని వరిస్తుందో చూడాలి.

# బ్యూటీ.. వరల్డ్‌వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రెడీ!

యంగ్ హీరో అంకిత్ కొయ్య, నీలఖి జంటగా తెరకెక్కిన బ్యూటీ సినిమా ఇప్పటికే టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో మంచి బజ్ క్రియేట్ చేసింది. రియల్ లైఫ్ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌పై మంచి అంచనాలు ఉన్నాయి. సెప్టెంబర్ 19న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన ప్రమోషన్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరగడంతో ఆసక్తి మరింత పెరిగింది. స్టార్ డైరెక్టర్ మారుతి, కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ వంటి వారంతా ఈ సినిమా ప్రత్యేకతను గురించి మాట్లాడ దంతో ఆడియన్స్‌లో ఆసక్తి కలిగింది. తండ్రి కూతురు అను బంధం, కుటుంబ విలువలతో కూడిన కథ ప్రేక్షకులను కచ్చితంగా కనెక్ట్ చేస్తుందనే నమ్మకం టీమ్‌కి ఉంది. ఇప్పుడు మేకర్స్ ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే యూఎస్ఏ, కెనడాలోని ప్రముఖ నగరాల్లో ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ాావీజ, =వస్తుశ్రీ, మీుతీషబం, ఝతీఎఆఅం, జఆఅవశ్రీశీబఅస్త్రవ వంటి థియేటర్లలో షెడ్యూల్స్ ఫిక్స్ చేశారు. న్యూ జెర్సీ, న్యూయార్క్, చికాగో, టెక్సాస్, కాలిఫో ర్నియా, అట్లాంటా, టాంపా, ఒమాహా, మిన్నెసోటా, నాష్‌విల్లే లాంటి నగరాల్లో బ్యూటీ ప్రదర్శించనుంది. కెనడాలోనూ టొరంటో, మిస్సిసాగ, రిచ్మండ్ హిల్‌లో రిలీజ్ కానుంది. ఈ లెవెల్




రిలీజ్ అంటే, మిడిల్ రేంజ్ సినిమాకు చాలా అరుదైన అవకాశం. సాధారణంగా ఇలాంటి లవ్ ఫ్యామిలీ డ్రామాలు లోకల్ మార్కెట్‌కే పరిమితం అవుతాయి. కానీ, బ్యూటీ మూవీని జీ స్టూడియోస్, వానర సెల్యూలాయిడ్, మారుతీ టీమ్ ప్రొడక్ట్స్ బ్యానర్స్ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లడం విశేషం. కంటెం ట్‌పై మేకర్స్ ఉన్న నమ్మకానికి ఇదొక నిదర్శనం అని చెప్పవచ్చు. సినిమాలో నరేష్, వాసుకి, నందగోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్ వంటి వారు కీలక పాత్రల్లో నటించారు. డైరెక్టర్ జె.ఎస్.ఎస్.వర్ధన్ తన ప్రత్యేకమైన రైటింగ్, దర్శకత్వంతో ఈ సినిమా హృదయాలను హత్తుకుం టుందని చెప్పొచ్చు. ఇప్పటికే బ్యూటీపై వచ్చిన రిపోర్ట్స్, సెన్సార్ రివ్యూలు కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com